క్లుప్తంగా

ఘనంగా కాలేజీ డే



మెమొంటో అందిస్తున్న కరస్పాండెంట్ వీర్రాజు

జమ్మికుంట: విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్ కోసం ప్రణాళికలు రూపొందిస్తూ మంచి బోధన అందిస్తున్నామని గాయత్రి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ముష్క వీర్రాజు అన్నారు. పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో శుక్రవారం కాలేజీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, అత్యుత్తమ విద్యనందిస్తూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు సెలెక్ట్ అయ్యేలా చేస్తున్నామని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం కళాశాల బాధ్యత తీసుకుంటుందన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంజిబాబు, రమేశ్, సాగర్, చంద్రయ్య, కరుణ, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహప్రతిష్ఠాపనకు ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి రూ.20వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు గౌడ సంఘం నాయకులుకు శుక్రవారం నగదును అందించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు ఎంపీపీని అభినందించారు.

సైకిళ్లు అందజేత



సైకిళ్లు పంపిణీ చేస్తున్న వేణుగోపాల్

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్ ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థినులకు రోటరీక్లబ్ ఆఫ్ ఎలగందల్ ఫోర్ట్ అధ్యక్షుడు పట్నం వేణుగోపాల్ శుక్రవారం సైకిళ్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ సంయుక్తంగా వెల్జన్ సంస్థ సహకారంతో దూరప్రాంతంలో చదువుకునే పేద విద్యార్థినులను గుర్తించి సైకిళ్లు అందజేస్తున్నామని అన్నారు. ఈసందర్భంగా రొటేరియన్ ఎర్రం రాజిరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారతలో భాగంగా ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం స్వరూపరాణి, ఉపాధ్యాయులు, విదాద్యర్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' డబ్బులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

మానకొండూర్: ఉపాధి కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధిహామీ చట్టాన్నీ నిర్వీర్యం చేయొద్దని సూచించారు. ఆలస్యం చేయకుండా కూలీలకు వారం రోజుల్లోనే పని డబ్బులు చెల్లించాలని, ప్రమాదబీమా పథకం అమలు చేయాలని కోరారు. కొత్త జాబ్‌కార్డులు ఇవ్వాలని పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని, రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.

పొదుపు సంఘం సమావేశం

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో పురుషుల పొదుపు సంఘం వార్షిక సమావేశం శుక్రవారం నిర్వహించారు. సంఘ ఆదాయ వ్యయాలను అకౌంటెంట్ సారయ్య చదివి వినిపించాడు. అనంతరం నూతన అధ్యక్షుడిగా రాజిరెడ్డి ఎన్నికయ్యారు. బత్తిని శ్రీనివాస్‌ను పాలకవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పొదుపుసమితి మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఓదెలు, మొగిలి, సంపత్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెదిరలో పోషణ పక్వాడ



శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పరిధి రాజాజీనగర్ కాలనీలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మహిళ చిరుధాన్యాలు తినడం వల్ల మంచి పోషకాలు అందుతాయని తెలిపారు. అనంతరం చేతులు శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎం పలువురు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా కసరత్తు

- హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్
- డిమాండ్ రూ.5.76 కోట్లు, వసూలైంది రూ.2.94 కోట్లు
- 31వ తేదీతో ముగియనున్న గడువు



హుజూరాబాద్: ఈ ఏడాది హుజూరాబాద్ బల్దియాకు రావాల్సిన ఆస్తి పన్నుల వసూలుకు అధికారులు లక్ష్యం దిశగా కసరత్తు చేస్తున్నారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకొని నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పన్నుల రూపంలో హుజూరాబాద్ బల్దియాకు రూ.5.76 కోట్లు వసూలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్న అధికారులు ఇప్పటి వరకు ప్రాపర్టీ ట్యాక్స్ 83.67 శాతం మాత్రమే వసూలు చేశారు. మున్సిపల్ పన్నుల జాబితాలో ఆస్తిపన్ను, నాన్ ట్యాక్సెస్‌కు సంబంధించిన మొత్తాలను మార్చి 31వ తేదీ వరకు వందశాతం వసూలు చేయాల్సి ఉంది.

నెల రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్

హుజూరాబాద్ బల్దియా పరిధిలో ఆస్తిపన్ను వసూలుకు అధికారులు నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచే పన్నులు వసూలు చేస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.5.76 కోట్ల బకాయి ఉండగా, ఇప్పటివరకు రూ.2.94 కోట్లు వసూలు చేశారు. వందశాతం టార్గెట్ పూర్తి చేయాలనే సంకల్పంతో అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆస్తి పన్ను రూ.పదివేలకు పైగా బకాయి ఉండగా రెండు, మూడేళ్లకు పైబడి పన్నులు చెల్లించని వారిని ముప్పై మందిని అధికారులు గుర్తించి గడువులోగా పన్నులు చెల్లించాలని కోరుతూ ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశారు.

పన్నులు	డిమాండ్	వసూలైంది	బకాయి
ఇంటిపన్నులు	రూ.2.43 కోట్లు	రూ.2.3 కోట్లు	రూ.40 లక్షలు
నీటి పన్నులు	రూ.2.41 కోట్లు	రూ.50 లక్షలు	రూ.1.91 కోట్లు
షాపింగ్ కాంప్లెక్స్	రూ.49.53 లక్షలు	రూ.9.12 లక్షలు	రూ.40.41 లక్షలు
ట్రేడ్ లైసెన్స్	రూ. 27.64 లక్షలు	రూ.17.37 లక్షలు	రూ.10.27 లక్షలు
తైబజార్	రూ. 14.52 లక్షలు	వందశాతం వసూలు	0000000

పట్టణాభివృద్ధికి సహకరించాలి



హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రాపర్టీ టాక్స్ ఇప్పటి వరకు 83.67 శాతం వసూలు చేశాం. 31.03.2023 వరకు బకాయి ఉన్న వారికి ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ అవకాశం కల్పించింది. కేవలం 10 శాతం వడ్డీతో పన్నులు చెల్లించవచ్చు. అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో బల్దియా పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

వినియోగదారుల హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న బెల్లి రాజయ్య

జమ్మికుంట: వస్తువు నాణ్యతాలో కల్తీ ఉన్నప్పుడు వినియోగదారులు జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలోని వినియోగదారుల హక్కుల ఫోరానికి వెళ్లి ఫిర్యాదు చేసి తగిన ప్రతిఫలం పొందవచ్చని, వినియోగదారుల హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జిల్లా వినియోగదారుల మండలి బాధ్యులు బెల్లి రాజయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ అధ్యక్షతన వినియోగదారుల హక్కుల దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినియోగదారుడు ప్రతి వస్తువు కొనుగోలు చేసినప్పుడు రశీదు తప్పనిసరిగా పొందాలని, మోసపోయినప్పుడు తగిన న్యాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. నాణ్యమైన, గుర్తింపు పొందిన వస్తువులు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగ అధిపతి బల్మూరి మహేందర్‌రావు, అధ్యాపకులు ఎడమ శ్రీనివాస్‌రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ రామ్మోహన్‌రావు, రేణ ఈశ్వరయ్య, స్వరూపరాణి, రవిప్రకాశ్, ఎంబడి రవి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, సుష్మ, మమత, ప్రశాంత్,అరుణ్‌రాజ్, సాయి కిరణ్, రమేశ్, అనూష తదితరులు పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు



మాట్లాడుతున్న భగవాన్‌రెడ్డి, తదితరులు

హుజూరాబాద్: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు (2024–25) 28న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ కంకణాల భగవాన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశానుసారం ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తున్నామని, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా కంకణాల భగవాన్ రెడ్డితో పాటు ఎలక్షన్ ఆఫీసర్లుగా సీనియర్ న్యాయవాదులు నక్క సత్యనారాయణ, జెమ్స్ వ్యవహరిస్తారని, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీ, లైబ్రరీ సెక్రెటరీ, ట్రెజరర్, స్పోర్ట్, కల్చరల్ సెక్రెటరీ, సీనియర్ ఈసీ మెంబర్, జూనియర్ ఈసీ మెంబర్, లేడీ ఈసీ మెంబర్ ఎన్నిక ఉంటుందన్నారు. ఓటు హక్కు ఉన్న 117 మంది న్యాయవాదుల ఓటర్ల జాబితాను విడుదల చేశారు. 18 నుంచి 20వ తేదీ వరకు సాయంత్రం ఐదుగంటల వరకు నామినేషన్లు స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, 22న ఉపసంహరణ, పోటీచేసే అభ్యర్థుల ఫైనల్ లిస్టును అదేరోజు నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తామని వివరించారు.

పోలీసుల అదుపులో జేఏసీ నాయకులు



నాయకులను తీసుకెళ్తున్న పోలీసులు

గన్నేరువరం: మండలంలోని మైలారం మైసమ్మ గుట్ట నుంచి మానేరు వాగుపై కరీంనగర్‌లోని ఎల్ఎండీ కట్ట వరకు బ్రిడ్జి నిర్మిస్తామన్న హామీని ఎంపీ బండి సంజయ్‌కుమార్ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గన్నేరువరంలో బ్రిడ్జి నిర్మాణ జేఏసీ నాయకులు శుక్రవారం శాంతియుత నిరసన చేపట్టారు. బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర మండలంలో కొనసాగుతుండటంతో ముందు జాగ్రత్తగా పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బ్రిడ్జి నిర్మిస్తామని గత ఎన్నికల్లో ఎంపీ బండి సంజయ్ హామీ ఇచ్చారని, ఐదేళ్లు గడుస్తున్నా నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్, ప్రధాన కార్యదర్శులు పుల్లెల రాము, బామండ్ల రవీందర్, సీనియర్ నాయకులు కయ్యం సంపత్ పాల్గొన్నారు.

కల్చరల్ యాక్టివిటీస్‌లో విద్యుత్ ఉద్యోగి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రాజయ్య

జమ్మికుంట: యాదాద్రి భువనగిరి జిల్లాలో గురువారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర ట్రాన్స్‌కో, డిస్కాంల ఇంటర్ కాంపిటీషన్‌లో విద్యుత్ ఉద్యోగుల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్‌లో జమ్మికుంట పట్టణానికి చెందిన విద్యుత్ ఉద్యోగి గంగారపు రాజయ్య ఏకపాత్రాభినయంలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యుత్ సౌధ చీఫ్ జనరల్ మేనేజర్ లలిత, స్పోర్ట్స్, కల్చర్ ఆఫీసర జగన్నాథం చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్నారు. అలాగే ఫ్యాన్సీ డ్రెస్ యాక్షన్‌లో మూడో బహుమతి సాధించారు. దీంతో జమ్మికుంట విద్యుత్ ఉద్యోగులు, మడిపల్లి గ్రామస్తులు శుక్రవారం హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు



చొప్పదండి: మండలంలోని కొలిమికుంట గ్రామం హనుమాన్ ఆలయం వద్ద సంచరించే వానరం శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా గ్రామస్తులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గతంలోనూ ఓ వానరం హనుమాన్ ఆలయం సమీపంలో రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందగా గ్రామస్తులు అంతిమ సంస్కారాలు చేసి కోతిబొమ్మను ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి, గొడిశాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం సాయంత్రం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పనులు నిర్వహిస్తున్నందున సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరుగంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్, వెంకట్రావుపల్లి, రాజపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హుజూరాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

తిమ్మాపూర్: అల్గునూరు ట్రాన్స్ కో పరిధిలోని తిమ్మాపూర్, మహాత్మా నగర్ అలుగునూర్ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 33 కేవీ మెయింటనెన్స్‌లో భాగంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ వెంకటరమణ కోరారు.

కేంద్ర బలగాలు, పోలీసుల కవాతు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో ఎంపీ ఎన్నికల దృష్ట్యా శుక్రవారం కేంద్రబలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై లక్ష్మారెడ్డి, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం

గంగాధర: గంగాధర మండల చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించారు. బాల్యవివాహాలు జరుగకుండా చేపట్టాల్సిన చర్యలపై సభ్యులు చర్చించారు. వివాహం నిర్ణయించే ముందు పుట్టిన తేదీల ధృవీకరణ పత్రాలను చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో రాము, ఐసీడీఎస్ గంగాధర ప్రాజెక్టు అధికారి కస్తూరి, ఎంఈవో వేణుకుమార్, వైద్యాధికారి శ్వేత, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, అధికారులు జీవన్‌కుమార్, సూపర్‌వైజర్ రమాదేవి, రేణుక, కవిత, మతపెద్దలు రఘు, ఫీటర్, సద్దాం పలువురు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతాంగానికి ఇబ్బంది ఉండదు

- విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపనలో మంత్రి పొన్నం ప్రభాకర్



విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: రాష్ట్ర రైతాంగానికి వందశాతం ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులు, ప్రజలు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కోరారు. మండలంలోని ఉప్పరమల్యాలలో శుక్రవారం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో భూమిపూజ చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే విద్యుత్ సమస్య తీరుతుందని, పక్కనున్న కాలువల్లో పదేళ్లగా ఎలాంటి పురోగతి లేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ కరువు తీసుకొచ్చిందని కొందరు మూర్ఖులు, అజ్ఞానులు అంటున్నారు సెప్టెంబర్‌లో వర్షాలు పడలేదు అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. ఆశించిన వర్షాలు కురవకపోవడంతో కరువు వస్తుందని, ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు సమీక్షిస్తూ రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందిస్తున్న ప్రణవ్‌బాబు

హుజూరాబాద్: చదువుకు పేదరికం అడ్డు కావొద్దు, చదువుకోడానికి ముందుకు వస్తే సహకరించడానికి మేము ఉన్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పరీక్ష సామగ్రి ఇవ్వడానికి ముందుకు వచ్చిన సరితజైపాల్‌రెడ్డిని అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ త్వరలోనే అందజేస్తామని, అదనపు గదుల నిర్మాణం, ఇతర సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎంఈఓ కేతిరి వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ... 10/10 జీపీఏ సాధిస్తే ప్రోత్సాహ బహుమతి కింద రూ.5,116 అందజేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సమ్మిరెడ్డి, తిరుమల, సరిత, జయపాల్ రెడ్డి, రత్నం, కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, పుష్పలత, కిరణ్ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో భారీగా నామినేషన్లు వేస్తాం



మాట్లాడుతున్న సాధన సమితి సభ్యులు

జమ్మికుంట: దళితబంధు రెండో విడుత నిధులు మంజూరు కానీ బాధితులు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ స్థానానికి హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి భారీగా నామినేషన్లు వేస్తామని దళితబంధు సాధన సమితి సభ్యులు కొలుగూరి నరేశ్, మంద రాజేశ్, కొలుగూరి నరేశ్, రామంచ రాకేశ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండోవ విడత నిధుల కోసం కలెక్టర్, అధికారులు , రాజకీయ నాయకులకు వినతి పత్రాలు అందించామన్నారు. కావాలనే ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే దళితబంధుపై అధికారిక ప్రకటన చేయాలని, లేదంటే కరీంనగర్ ఎంపీ స్థానానికి 400 పైచీలుకు నామినేషన్లు వేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో అకినపల్లి ఆకాశ్, కొడెపాక రక్షిత్, పాత రాజేశ్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట వారసంత(అంగడి) వేలం రూ.40.16 లక్షలు



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంత(అంగడి) 2024–25 ఆర్థిక సంవత్సరానికి అంగడి ఫీజులు వసూలుకు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు, కమిషనర్ ఆయాజ్ ఆధ్వర్యంలో కార్యాలయంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో 21 మంది రూ. రెండు లక్షల ధరావతు డీడీలు సమర్పించారు. 17 మంది పాల్గొనగా ముద్రవేణ శంకర్ రూ.40.16 లక్షలకు వేలం దక్కించుకున్నారు. గతేడాది రూ.37.65 లక్షలకు వేలం కాగా ఈ సంవత్సరం మున్సిపల్‌కు అదనపు ఆదాయం సమకూరనుంది. మేనేజర్ భూపాల్‌రెడ్డి, అసిస్టెంట్ భాస్కర్, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్లు సదానందం, ధరావతు సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గంగాధర: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గంగాధరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మున్నూరుకాపు సంఘం మండలశాఖ ఆధ్యక్షులు మడ్లపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

శంకరపట్నం: ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను ప్రకటించడంతో శుక్రవారం మండల కేంద్రంలో సీఎం , మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత



ప్రొసీడింగ్ పత్రం అందిస్తున్న కరుణాకర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీవినాయకరెడ్డి సంఘం నూతన భవన నిర్మాణానికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ రూ.మూడు లక్షలు కేటాయించారు. ప్రొసీడింగ్ పత్రాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి సంఘం సభ్యులకు శుక్రవారం అందజేశారు. మరిన్ని నిధులు కేటాయిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈసందర్భంగా సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకులు సాయికృష్ణారెడ్డి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంచ రాజిరెడ్డి, రాల్లబండి సంతోష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి కోతి శ్రీనివాస్‌రెడ్డి, వెదిర రెడ్డి సంఘం అధ్యక్షుడువంగళ భూంరెడ్డి, గ్రామ నాయకులు ఆంజనేయులు, మహేశ్, రాము, వంశీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరీంనగర్‌కు తరలిన ముదిరాజ్‌లు



కరీంనగర్ వెళ్తున్న ముదిరాజ్‌లు

సైదాపూర్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మత్స్య సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాయిశెట్టి చంద్రయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌కు తరలివెళ్లారు. జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పిట్టల రవీందర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా మద్దతు తెలిపేందుకు వెళ్లారు. సైదాపూర్ మత్స్య సహకార సంఘం డైరెక్టర్ నెల్లి రాములు, మారుపాక రాజు, లంకసిరి రాజు, బాషవేని రాజయ్య, కొలకాని మైసయ్య, ఎలబోయిన వెంకటయ్య, గూళ్ల వెంకట్రాజం, గంగధారి కనుకయ్య, తాడవేని కనుకయ్య, పిట్టల కిరణ్, నాయకులు ఉన్నారు.

కాన్షీరాంకు నివాళి

చొప్పదండి: అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం కాన్షీరాం జయంతి నిర్వహించారు. ఏవైఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

హుజూరాబాద్: పట్టణంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతి నిర్వహించారు. నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిచారు.

గంగాధర: మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు కాన్షీరాం జయంతి నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు.